# పోలాం పిల్లలు

ఎర్రాయి, ఎంకటాముల అమ్మ పోలాం, అయ్య పుల్లాయిలు సీతారావుమ్మ గోరింటిపక్క రంగయగోరి తోట కనిపెట్టుకునుంటారు; కాని తోటమీన కాత్తె కూత్తె గిట్టుంటే అయ్య పక్కింటి సీతారావుమ్మగోరింటో పాసిపనికి కుదిర్న అమ్మను కాణీకి అద్దణాకంటూ పానాలు పీక్కదినడు.

ఆ దినం తెల్లారి లెగిసి ది మొదలు అయ్య అదొక పద్ధతి గుండాడు. ఆ వజాన ముసుగేసుకుని గుడిసెగోడ కానుకు కూసుని అమ్మకల్లీ, తమకల్లీ మద్దె మద్దె కోరసూపులు సూత్తుంటం ఎర్రాయి, ఎంకటాములకు వొల్లంతా దురద గుంటాకు రుద్దినట్టుగుండది.

"ఎర్రాయ్?"

"ఏందే ఎంకటాం?"— సాటుసాటున గుసగుస లాడుకుండారు ఎర్రాయి, ఎంకటాములు.

"ఏందిరా, అయ్య అట్ట కూకుండాడు కదలకండా?" అంది ఎంకటాం.

"అదేమో, యిగ్రహానికిమల్లే అటనే కూకుండాడు—పుగాకు లేదుగా హాంల్న." అన్నాడు ఎర్రాయి.

"పుగాకూ! ఎదవపుగాకు ఏంయ్యా లేకపోతే?" అంది ఎంకటాం.

"అదేమ్మాటా—కుతిగా వుండ దెట్టా?" అన్నాడు ఎర్రాయి.

"కుతిగా వుంటే? డబ్బులు యాణ్ణుంచొస్తాయిరా పద్దాకా! ఒరేయ్, నువ్వు పొగాకు తాగావంటే అయ్యతో సెబతా" అంది ఎంకటాం,

"శా—నేనా ఎదవపుగాకూ! ఓపాలి అయ్యే అడిగితే లేదన్నాగా!" అన్నాడు ఎర్రాయి.

"ఏందిరా అడిగిందీ?"

"పుగాకు"

"ఎవుర్నీ?"

"నన్నే"

"నిన్నా!"

"ఓ పాయుంటే యిటు పారేయరా—అనడిగాడే"

"ఏందీ!"

"అమయిన సంపుతాడేమోనని లేదన్నా."

"నువు తాగుతావంట్రా ?"

"సీ, ఎదవదీ! ఓపాలి ఎట్టుండదోనని సూశాలే-సన్నాసిది!"

"ఒరేయ్-అమ్మతో సెప్పనా ?"

"నే తాగుతేగా-అట్ట సూసి ఆటనే పారేత్తినిగా"

"అమ్మ సంపుద్దిరోయ్-"

"మరి అయ్య కిచ్చిద్దే కాణీలు - కొనుక్కోమనీ ?" అన్నాడు ఎర్రాయి.

"యీ అయ్య కేం పన్లేదు; పద్దాకా అమ్మను సంపుతావుంటాడు" అంది ఎంకటాం.

"ఏమేయ్ ?" అనరిసి బిలిశాడు అమ్మను అయ్య.

"నిన్నే నేయ్ ?" అని మల్లీ అరిశాడు అయ్య.

అమ్మ యిసుక్కుండది.

"నిన్ను గదంటే ?" యింకా గెట్టిగా అరిశాడు అయ్య.

"ఎందుకు అట్టరుసుకుంటావ్ ?" అంది అమ్మ.

"అయితే నువు ఎల్తానంటావా ఎల్లనంటావా ?" అన్నాడు అయ్య.

అప్పటికి కాత్తె ఎండెక్కింది. అయ్య ఎవారం కాత్తె కాకమీనుంటంజూసి సల్లగా ఎర్రాయిసెయి గీరింది ఎంకటాం. యింకూసేపిట్లో గుడిసెకెనకమూల నారీజసెట్టుకింద యిటికకుప్పసాటుకు సేరి సప్పిడి కాకుండా కూసుండారు ఎర్రాయి, ఎంకటాములు.

అరవమాక మంది ఎంకటాం ఎర్రాయితో.

అరవనన్నాడు ఎర్రాయి ఎంకటాంతో.

గుడిసెలో తుబుక్కున వుమ్మాశాడు అయ్య.

"అయితే నువు చీతారావుమ్మగోరింటికి పనికెందుకెల్లవే?" అనన్నాడుఅయ్య.

"నువు లచ్చజెప్పు నే నెల్లను" అంది అమ్మ.

"అది గందుకనే జెప్పేది. ఎందుకెల్లవూ అంట ?" అన్నాడు అయ్య.

"ఆరి సబ్బిల్లలన్నీ నేనే పూసుకుండానంట" అంది అమ్మ.

ఎంకటాం ఎర్రాయికల్లి సూత్తే ఎర్రాయి ఎంకటాంకల్లి సూశాడు.

"సబ్బిల్లలూ ! సబ్బిల్లలేందే" అన్నాడు అయ్య.

"సబ్బిల్ల లేందంటాడేం? అరు రుద్దుకునే సబ్బిల్లలన్నీ నేనే రుద్దుకుంటున్నానంట."

"అఁ ఎవురన్నారూ ?" అన్నాడు అయ్యి.

"యింకెవు రంటారూ—అ చీతారావుమ్మగోరే"

"మరెందుకు రద్దుకున్నా ?" అన్నాడు అయ్యి.

"యిదేందియ్యోవ్, నువు అయిణ్ణి ఎసకేసుకొస్తున్నట్టుందే సూత్తే— యిగసాల్లే వూరుకో యియాల్టికి."

"చరే, అట్టనే వూరుకుంటా—అయితే చీతారావుమ్మగోరు నిజంగా అన్నదంటా ?" అన్నాడు అయ్యి.

"అన్నదంటా! ఓ అంట వేంటీ— మీన మీన కొచ్చిందిగా !"

మల్లీ తుళుక్కున వుముృకాడు అయ్యి.

"అయితే యిప్పు దేందే నువనేదీ?" అన్నాడు అయ్యి కూసేపుండి.

"నే నెల్ల నాడికి"—యిసిరేసినట్టంది అమ్మ.

"తొందరపడ్డావులే" అన్నాడు అయ్యి.

"ఎవురు నేనా ?"

"అఁ నువేనే. కాకబోతే పతినెలా రెండు రూపాయలు సేదంటే నీకూ ?" అన్నాడు అయ్యి.

"యాడుంటదీ— యాగన్నా పుగాకు సేదుగా వుంటదెట్టా ?" అంది అమ్మ.

"అడిగదుంకే తిక్క రేగుద్ది – నువుగాంగా మా లావు సంపాయించావులే ముండమోపి డబ్బులు." అన్నాడు అయ్యి పెటీమని కొట్టినట్టు.

ఎర్రాయి ఎంకటాంకల్లి సూశాడు. ఎర్రాడి రెక్కగూణ్ణి ఒక్కగుంజు గుంజింది ఎంకటాం.

"అంత రోసం గలోడివయితే ఎల్లి సంపాయించుకు రారాదూ ?" అంది అమ్మ.

"అయితే నే నీడ ఎవవనై కూకుండానంటావు ?"

"నే నన్లేదయ్యోవ్ అంత లావుమాట! నీకేం మారాజుకుమల్లేనే కూకుం డావు" అంది అమ్మ.

"ఆఁ కూకుండాలేవే. తోటమీన కాత్తె కల్సొత్తే నవామాట లంటా ? మ రారంగయగోరు ఆవజాన నడుపుతుండాడు యవారం."

"మరి ను వావజాన నీలునవుల్తా కూకుంటే యవారం నడపడెట్టా ?" అంది అమ్మ.

"తోట కాత్తె ఎదిగి లాజాన పడ్తే ఏమన్నా యిత్తానంటుంటే యిగా మడి

సితో ఏంజేత్తా ?''

''యింకా ఒకటే ఎదగాల్చిందే యివకాడ డొక్క పీక్కబోతావుంటే. యవారం యిట్టనంటయ్యా వుండాల్చిందీ ?'' అంది అమ్మ.

''ఆ ఎవారమేందో నే దెల్సుకుంటా గానీ యిప్పుడు నీ యవారమేందో ముంగల దేల్చు.'' అన్నాడు అయ్య.

''నా యవారం నీ యవార మేందంటా ?''

''ఏందేందే ! గొప్పోర్తో నువూ నే నంటే తిరగబడాల్చిందీ ? అస లట్టయితే ఎట్టానంటా ?'' అన్నాడు అయ్య.

''నీతత్వా లేందో తెలపటం లేదు గాని, అసలామడ్చి మాటిమాటి కావజాన సేతులు తిప్పద్ది, దేనికంటా ?''

''సేతులు తిప్పట మేందే'' అన్నాడు అయ్య.

''మ రదేందో సబ్బులంటా సేతులు తిప్పద్దీ !''

''ఎవురూ ?'' అన్నాడు అయ్య.

''ఆ చీతారావుమ్మగోరే !'' అంది అమ్మ.

''అగిగదే వొద్దన్నా'' అన్నాడు అయ్య.

''ఏంది వొద్దన్నా'' అంది అమ్మ.

''యిట్టాటియన్నీ తోసేసకు తిరగాల్చిందే'' అన్నాడు అయ్య.

''ఎల్లి నువు నిలబడు ఆయిడ ముంగల''

''ఆ, నిలబడాల్చిందే''

''నువు లచ్చ జెప్పు''

''సెప్పి నట్టేను''

''మరి సబ్బిల్ల లంటంటే—''

''ఏహె అంటే అందిలే''

''ఆమాట ఎ దగ్గాను రావాల్సొచ్చిందంటా ?''

''రాగాలు తీయమాక —''

''నువు తియడంలా —''

''నేనా—పౌష్యాద్దయి —''

ఆవజాన కళాపి గొట్టినట్టు ఎడాపెడా అయ్యా, అమ్మలమద్దే దుమ్ము లెగిసేతలికి బెడిసి లెగిసి రాత్తా పక్క సింతిసెట్టింది కొచ్చి కూకున్న ఎర్రాయి. ఎంకటాలలకు సీతారావుమ్మగోరియింటి ముంగలకు ఓ మనగాడి తెల్లగుర్రాం

బండి ఎగురుకుంటా వచ్చి నిలబట్టం అగుపిచ్చింది.

"ఆర్నీ— రాంకిట్టయ్యగోరు-!" అన్నాడు ఎర్రాయి లెగుస్తా.

"ఏ రాంకిట్టయ్యగోర్రా?" అనడిగింది ఎంకటాం తనూ ఎర్రాయితో లెగుస్తా.

"ఎహె, చీతారావుమ్మగోరి అల్లుళ్ళే. తసదియ్యా—చుందరమ్మ పంట పండింది!"

"ఎందుకురా పంట పండిందీ-?" అనంటుండా యినిపిచ్చుకోకుండా ఎంకటాం రెక్క బట్టుకుని గబగబ బండికాడికి లాగాడు ఎర్రాయి.

రాంకిట్టయ్యకళ్ళీ, రాంకిట్టయ్య ఎక్కొచ్చిన బండీ, బండిసాయిబు ఎర్రగళ్ళ లుంగీ, నల్లగడ్డాంకళ్ళీ కిందనించి పైదాకా ఆవజాన ఓసూపు జూసి, ఎంకటాం సెయిబట్టుకు తల్లగుర్రం సుట్టూతా ఎర్రాయి ఓ సెర్కం తిరిగేతలికి సొరగ లోకాన్నించి ఎగ్గిర్దూకినట్టొచ్చి సెంబునీలతో కాలకడా లాడిస్తా వాకిట్లోకొచ్చి నిలబడ్డది సీతారావుమ్మగోరు.

సాయిబును టంకుపెట్టె లోనకు పట్టుకురామంటా బూడుసులు టక్ టక్ కొట్టుకుంటా కెడ్డీకి మల్లే సీతారావుమ్మగోరింట్లోకి నడిశాడు రాంకిట్టయ్య.

"పాపం - మాయింట్లోనే భోంచేసి వెళ్ళేం?" అని పెద్దగా అంటున్నది సీతారావుమ్మగోరు సంబరంగా.

"సూశావంటే?" అన్నట్టు సూశాడు ఎర్రాయి, ఎంకటాంకల్లి. ఎంకటాం సీతారావుమ్మగోరికల్లి సూసింది. సీతారావుమ్మగోరు గబిక్కిన సూసింది ఎర్రాయి, ఎంకటాముల కల్లి—బూమి పగిలి ఆడేందో లెగిసినట్టు.

"అ ముండేదీ - నాయన్నాయన! కాస్త ఒక్కసారి యిట్లా వొచ్చి పొండి, ఏమన్నా యింత తునక చేతిలో పెడ్తా—దేవుడు పంపిన ట్టొచ్చారు నాయన - అ వకుండా దొడ్డోకి రండేం—" అంటా లోనకి నడిసింది సీతారావుమ్మగోరు నవుతా.

ఇంతూసేపుటికి సీతారావుమ్మగోరి దొడ్డో కరేపసెట్టుకింద అంటగిన్నెల మయాన - గొబ్బెమ్మలకి మల్లే—కూకుండారు ఎర్రాయి ఎంకటాములు.

టకటకటక మట్టెలు కొట్టుకుంటా పావురాయికి మల్లే ఎగురుకుంటా మద్దె గెదిలోంచి దొడ్డో కొచ్చి వొక్కపాలి పక్కన సెయిబెట్టుకు పగలబడి వొంటిం టోకి లగెత్తికెల్లింది సుందరమ్మ.

"యిహి-" అంటా మనికట్టుతో ముక్కు ఎగదోసుకుండాడు ఎర్రాయి.

"ఎందుకురా అట్టా ఎగబీల్సుకుంటా నవుతావ్ ?" అంది సుందరమ్మ దూ డుకు దిమ్మరబోయిన ఎంకటాం.

"తసదియ్య, బలేదిగదంటే చుందరమ్మా-"

"గెట్టిగా అరవమాకరా సచ్చినోడా-"

"ఆ సాయిబు వెళ్ళాట్టే - పాపం ఆయనకి ఏం కావాలో కాస్త చూస్తుండ రాదుటే - వెళ్ళవే చచ్చిందానా-" అని కాత్తె పెద్దగా, కాత్తె సిన్నగా అంటు న్నది వొంటింటో సీతారావుమ్మగోరు.

"గారెలు జేత్తుండదేవ్-" అన్నాడు ఎర్రాయివాసన పీలుస్తా.

"యాడా ? వొప్పు రుబ్బలేదే-" అంది ఎంక టాం.

"మరేంటబ్బా సుయ్ మనిపిత్తుండదీ - వొకోడీలెట్టా ? నాలుగన్నా పెట్టుద్దో లేదో-"

"ఒరేయ్, అంతాశ వుండగూడదురా ?"

"పానీ, రెండన్నా పెట్టదంటా ?"

"తోమాల్రుట్రా అంట్లూ–కాసిని నీళ్లు తోడి పెట్టరూ అతొట్లలోకీ, బిందె ల్లోకి. కడవ భావిలో బడేసి చచ్చేరు - నాయన్నాయన ! కాస్త యీ నాలుగు బిందెలూ కడవాకూడా తోమిపెట్టరూ అల్లరిచేయకుండా ?" అంటూ సెక్రకండరిగి నట్టు వొచ్చి ఎల్లిపోయింది సీతారావుమ్మగోరు.

"ఏందిరా సూత్తుండావూ - ఒరేయ్ - ఒరేయ్-" అంది ఎంకటాం నుద్దెగది ఆతలగదేపు మెడజాపి సూత్తుండ ఎర్రాయికల్లి యింతగా సూస్తూ.

"ఎహ అరవమాకే-"

"ఏందిరా - ఏందిరా-!" కాత్తె ఎర్రాయికాడికి జరిగి తనూ అట్ట మెడ జాపిందో లేదో ఎంకటాం–ఎన్నెముకమీన ముల్లుగర్రతో పొడిసినట్టు ఓఫీమంటా ఎంకటామును తోసుకుంటా యిరుసుకు యివకాడ పడ్డాడు ఎర్రాయి.

"అమ్మ ! సత్తినో ర్రెరాయ్-" అంది ఎంకటాం వుక్కిరిబిక్కిరవుతా.

"అరవమాకే తల్లా-" లెగిసి ఎంకటామును గెట్టిగా వాటేసుకుండాడు ఎర్రాయి.

"ఎహె, అరవన్లే యిడూ - ఏందిరా నువు గెదికాడ సూత్తుండదీ ?"

"ఆళ్ళే - ఆళ్లు-"

"ఎవుర్రా !"

"రాంకిట్టయ్యా చుందరమ్మా-"

"ఆఁ !-"

"సెయి లటిక్కన పట్టుకుంటాడు !"

"ఎవుర్ది !-"

"చుందరమ్మదే !-"

"ఓయ్యో-"

"అదేమయిన గుంజుకుంటుండవి చుందరమ్మ !-"

"అమ్మబుల్లో !-"

"ఒరేయ్ పిల్లలూ, నీళ్ల తోడారుట్రా - అయ్యో అయ్యో ! నే నేంజేతునూ పక్షి మోహాలూ మీరూ - మా నాయనగదూ, మాఆమ్మగదూ, దబ్బున తోడి పెట్టరూ ?" అటా తలుపుకాడి కొచ్చి జూసి పిండి మరన పడ్డటయి - అటనే లోనకి గిరుక్కున మల్లింది సీతారావుమ్మగోరు పొకోడీలకాడికి.

మిట్టమద్దానం పొద్దు నిటారుగా నిలబడే యాలకు గుప్పిట్లు మూసుకుని గబగబ లగెత్తుకుంటా సీతారావుమ్మగోరింటోంచి వొచ్చి తోటపెండెంగోడ మొత్తకాడ నిలబడ్డారు ఎర్రాయి, ఎంకటాములు.

"నీకు ఎన్ని పొకోడీలు పెట్టిందే ఎంకటాం ?"

"రొండూ — నీకురా ?"

"నాకు మూడూ - ఏవే నీవి సూపించూ - సూశావ్మా, నాకు సిన్నవి బెట్టిందీ — నీకు కాణీ యిచ్చిందంటే ?"

"యియలేదురా - నీ కిచ్చిందంట్రా ?"

"ఆవ్ నా కిచ్చిందిగా !"

"పాసిలేరా - ఒరేయ్, కాణీతో పుగాకు కొనుక్కుంటావంట్రా ?"

"కాణీ నాదమ్మోవ్-"

సప్పున పెండెంగోడ కవకాణ్ణుంచి అమ్మ తలకాయ బెయిటికొచ్చి గబిక్కున ఎర్రాయి, ఎంకటాములను తోట్లో గుడిసెలోనకి మళ్ళేసుకెలింది.

"ఏందిరా మీకు చీతారావుమ్మగోరిచ్చిందీ, సూపియ్యండీ — పొకోడీ లంట్రా-" అంటా ఎర్రాయి ఎంకటాముల గుప్పిట్లు పరీచ్చజేస్తుండది అమ్మ.

"ఆడికాడ కాణీ వుండవి - యిటు బారెయరా, కాణీ-" అంటుండాడు అయ్య.

"కాణీ ! ఏదీ కాణీ -"— అంటుండది అమ్మ.

"ఆడికి చీతారావుమ్మగోరు కాణీ యిచ్చింది - జాంసెట్టెక్కి నే జూశా"

అంటుండాడు అయ్య.

"జాంపెట్టెక్కావూ ! ఎందు కెక్కా - వుండాడ - ఏదిరా కాణీ ?" అంటుండది అమ్మ.

"యిటు బారెయ్—" అంటుండాడు అయ్య జరుగుతా.

"యియమాకరా—"

ఎర్రాయి బొడ్లో కాణీబిల్ల టాప్పున బూమ్మీనపడి దొల్లుక్కుంటా దొల్లుక్కుంటా గుడిసెమూల సీకట్లో ఎల్తుండది. ఎంకటాం ఎర్రాయి సెయి బర బర ఒరికిందో లేదో - పౌకోడీ పిడికిట్లు బిగిచ్చుకుంటా వుండేల్బద్దగుండొదిల్నటు బయ్యన తోటమూల మల్లెపొదల సాటుకెళ్లి మాయమయ్యారు ఎర్రాయి, ఎంకటాములు.

('ఆంధ్ర పత్రిక' వికృతి ఉగాది సంచిక)